క్లుప్తంగా

## వైఎస్సార్ సీపీ వివిధ విభాగాలకు నియామకాలు



మంగళగిరి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి పట్టణ, తాడేపల్లి పట్టణానికి చెందిన వారిని వివిధ హోదాల్లో నియమించారు. మంగళగిరి పట్టణ మున్సిపల్ వింగ్ ప్రెసిడెంట్‌గా గారపాటి కోటిస్వామి(చింటు), పబ్లిక్ వింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ ఖలీల్, సోషల్ మీడియా సెక్రటరీగా పసుపులేటి అశోక్, యువజన విభాగం ప్రెసిడెంట్‌గా మాదాల గోపి, వైస్ ప్రెసిడెంట్లుగా తెనాలి వినయ్‌కుమార్, వెనిగళ్ళ నాగేశ్వరరావు, మేకతోటి హర్ష, జనరల్ సెక్రటరీలుగా కొండేటి చక్రవర్తి, గంజి ఆనంద్, షేక్ కరీముల్లా, గోలి వేణుకుమార్, కేసగాని ధర్మేందర్, సెక్రటరీలుగా మరో 16 మందితో పాటు, 27 మందిని ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమించారు.

## నృసింహుని ఆలయంలో భక్తజన సందడి



మంగళగిరిటౌన్: మంగళగిరిలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దిగువ, ఎగువ సన్నిధుల్లో శనివారం భక్తులు పోటెత్తారు. రెండవ శనివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి దర్శనానికి క్యూలో భక్తజనం వేచిఉన్నారు. దిగువ సన్నిధిలో నరసింహస్వామిని, రాజ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకుని ఎగువ సన్నిధిలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామిని భక్తితో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

## రేపటి పౌరులుగా ఎదగాలి



తాడికొండ: నేటి బాలలు రేపటి పౌరులుగా ఎదగాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ సిస్టర్ విద్యా అన్నారు. గుడ్‌షెపర్డ్ ఆధ్వర్యాన తుళ్లూరు మండలం వడ్డమానులో ఆర్‌సీఎం చర్చి వద్ద శనివారం అంబేడ్కర్ బాలల పార్లమెంట్ బాధ్యతలు, విధులను తెలియజేస్తూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ విద్య మాట్లాడుతూ చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. సమాజంలో సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఆశా వర్కర్ పాములపాటి లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విషజ్వరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలబాలికలు, గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అనిల్‌కుమార్, నాగమణి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ప్రోగ్రామర్స్ దినోత్సవం



గుంటూరు రూరల్: నగర శివారులోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం కంప్యూటర్ ప్రోగ్రామర్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌డేట్ చేసుకోవాలన్నారు. పీజీ కోర్స్ డైరెక్టర్ డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, ఎంసీఏ విభాగాధిపతి ఎం.ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

తెనాలి: ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తెనాలి మండల తహసీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఇప్పటికే తనిఖీలు చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నట్టు చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. తహసీల్దార్‌గా ప్రభుత్వ భూముల పరిరక్షణ తమ బాధ్యతల్లో ఒకటిగా గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందులో భాగంగా నందివెలుగులో డొంక పోరంబోకు భూమి 1.73 ఎకరాలను గత 24 సంవత్సరాలుగా ఒకే వ్యక్తి అనుభవంలో ఉందన్నారు. తనిఖీల్లో ఈ విషయం తెలిసి, ఆ భూమిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పట్టణ చినపాడులో 2.93 ఎకరాల భూమి, తమ పూర్వీకులదంటూ కొందరు ఆక్రమించే పనిలో ఉన్నారని చెప్పారు. ఆ భూమినీ స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ప్రభుత్వ భూముల జాబితా తెప్పించుకున్నామన్నారు.

## • గోతులదారులు



గణేషునిపాడు వెళ్లే దారిలో ఇలా



ఫిరంగిపురం కోనేరు సమీపంలో మార్జిన్ లేని రోడ్డు

ఫిరంగిపురం నుంచి సొలస వెళ్లే దారిలో గణేషునిపాడు శివారు వరకు ఉన్న సుమారు 5 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. అడుగుకో గుంత ఏర్పడటంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థ పడుతున్నారు. వాన కురిస్తే గోతుల్లో నీళ్ల నిలిచిపోతున్నాయి. సైడ్ మార్జిన్లు కూడా దెబ్బతిని కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉంది.

–ఫిరంగిపురం

# సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

తాడేపల్లిరూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో శనివారం సీఐటీయూ నాయకులు భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునర్మించాలని, సంక్షేమ పథకాలు అందించాలని ఈనెల 15న విజయవాడలోని లేబర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న కార్యక్రమాన్ని భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ప్రభుత్వాలు మారుతున్నా భవన నిర్మాణ కార్మికుల బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకాష్‌నగర్, మహానాడు, సుందరయ్యనగర్, తాడేపల్లి, నులకపేట తదితర ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యకర్తలు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత వేముల దుర్గారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నార్ని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

# అదుపు తప్పి మినీ లారీ బోల్తా

రోడ్డు విస్తరించాలంటున్న స్థానికులు

తాడేపల్లిరూరల్: మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శనివారం తాడేపల్లిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ఉండవల్లి సుందరయ్య చౌక్ నుంచి హిందూ శ్మశాన వాటికకు వెళ్లే దారిలో యూరియా లోడ్‌తో వెళ్తున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి.. సైడ్ కాలువలోకి దూసుకువెళ్లి బోల్తా పడటంతో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోల్తాపడిన వాహనాన్ని జేసీబీ సాయంతో తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రోడ్డు వెడల్పు లేక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బోల్తాపడిన వాహనాన్ని తరలిస్తున్న జేసీబీ

# విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవాన్ని జయప్రదం చేయండి

తాడికొండ: విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవాన్ని జయప్రదం చేయాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ యాదవ్ అన్నారు. శనివారం ఉద్దండరాయుని పాలెంలో మోదీ భూమి పూజ చేసిన ప్రాంతంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న బీజేపీ ఆధ్వర్యంలో సృష్టి పేరుతో విశ్వకర్మ యజ్ఞోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

గుంటూరు జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కులాలు, సంఘాల వారు, చేతి వృత్తుల వారు, రాజధానికి భూములు ఇచ్చిన ప్రజలు జయప్రదం చేయాల్సిందిగా రామకృష్ణ యాదవ్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ సెల్ కో కన్వీనర్ హేమ సుందర్, బీజేపీ మందడం మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి

## కొనసాగుతున్న రిలే దీక్షలు

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గొంతెమ్మ కోర్కెలను కోరడం లేదని, న్యాయంగా వారికి రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతున్నారని సీఐటీయూ నేత వేముల దుర్గారావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో శనివారం ఏసీసీ కార్మికులు చేస్తున్న దీక్షలను యూనియన్ నేతలు కూరపాటి స్టీవెన్‌తో కలసి ఆయన ప్రారంభించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ చట్టప్రకారం రావాల్సిన బకాయిలు మాత్రమే కార్మికులు అడుగుతున్నారని, ప్రభుత్వం గమనించి యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పిచ్చయ్య, సుభాని, సూర్యప్రకాష్, అంకయ్య, దేవరాజు, నాగేశ్వరరావు, నవనీతం, శివకుమారి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నేతలు

# దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు

ప్రత్తిపాడు: దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని మలినేని కళాశాలల చైర్మన్ మలినేని పెరుమాళ్లు అన్నారు. ఈ నెల 15న భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా నిర్వహించనున్న ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ – డేటా సైన్స్, అనుబంధ విభాగాల విద్యార్థులకు సాంకేతిక పోటీలను నిర్వహించారు. సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం, టెక్నాలజీ ప్రాముఖ్యత.. వంటి పలు అంశాలపై జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ పారిశ్రామిక, విద్య, టెక్నాలజీ రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులకు ఇంజినీర్లే కారణభూతులని తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని నైపుణ్యం పెంపొందించుకున్నప్పుడే తమ భవిష్యత్తు ప్రకాశవంతమవుతుంది అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కళాశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. పోటీల్లో విజేతలకు ఇంజినీర్స్‌డే రోజు బహుమతులు అందించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌లు, ఆయా విభాగాల హెచ్‌వోడీలు రామస్వామి, రవికిరణ్, హరికృష్ణ, జయరావు, సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.



సాంకేతిక పోటీల్లో వైర్‌లెస్ టెక్నాలజీపై వివరిస్తున్న విద్యార్థినులు

**ప్రత్యేక ఆకర్షణగా 'మలినేని మైక్స్ అండ్ మైండ్స్'**

వేడుకల్లో మలినేని కళాశాల ఏఐ అండ్ ఎంఎల్ విద్యార్థులు నిర్వహించిన 'మలినేని మైక్స్ అండ్ మైండ్స్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ – మెషిన్ లెర్నింగ్ విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు స్పీచ్ రికగ్నిషన్ టెక్నాలజీని వాస్తవ జీవితంలో ఎలా ఉపయోగించాలో వివరించారు. ప్రధానంగా యాక్టివ్ వాయిస్ మరియు ఫేక్ వాయిస్ మధ్య తేడాను ఎలా గుర్తించాలన్న అంశాలపై చేసిన పరిశోధలను వివరించారు. వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

## రేపటి నుంచి పశువులకు టీకాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పశుసంపదకు ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నెల రోజుల పాటు టీకాలు వేయనున్నారు. వీటితో పాటు గొర్రెలు, మేకలు, పెంపుడు కుక్కలకు టీకాలు వేయనున్నారు.

ఫిరంగిపురం: నదురుపాడు పశు వైద్యశాల పరిధిలోని పొనుగుపాడు, గుండాలపాడు, మునగపాడు, మేరికపూడి, వేమవరం, కండ్రిక, యర్రగుంట్లపాడు, నుదురుపాడులో ఈ నెల 15వ తేదీ నుంచి పశువులకు టీకాలు వేయనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

## కనీస వేతన చట్టం అమలుచేయాలి

తాడేపల్లిరూరల్: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేసి రూ. 26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడలో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గుండిమెడ పారిశుద్ధ్య గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నూతక్కి మహేష్, కార్యదర్శిగా మెండ్రు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఉషారాణి, సహాయ కార్యదర్శిగా ఏబేద్, కోశాధికారిగా దావులూరి దినేష్‌ను కమిటీ ఎన్నుకుంది.

## సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ

తెనాలి: రూరల్ మండల గ్రామం అంగలకుదురులో గల ఆంధ్రవాల్మీకి శ్రీవాసుదాసుస్వామి వారి పరంపర పీఠం 'దాసకుటి'లో 74వ శ్రీమహాలక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన షష్టమ పీఠాధిపతి శ్రీసీతారామదాసస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న సామూహిక కుంకుమార్చన కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం హనుమాన్ చాలీసా పారాయణ జరిగింది. మోదుమూడి, అంగలకుదురుకు చెందిన భక్తుల సహకారంతో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. 15వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రమా సహిత శ్రీసత్యనారాయణస్వామి వ్రతం జరుగుతుందని శ్రీసీతారామదాస స్వామి తెలిపారు. 15వ తేదీన మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, పూర్ణాహుతి ఎంతో విశేషంగా జరుగుతాయని, భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

## బాలికలకు నృత్య పోటీలు



తెనాలి: పట్టణానికి చెందిన రెయిన్‌బో ట్రస్ట్, శ్రీలక్ష్మీ నారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం బాలికలకు నృత్య పోటీలను నిర్వహించారు. కొత్తపేటలోని రాధాకృష్ణ కళ్యాణమండపంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి జరిగిన ఈ పోటీల్లో పలువురు ఇంటర్ వరకు చదువుతున్న బాలికలు పాల్గొన్నారు. నృత్యం నేర్చుకుని ఉండాలనేది షరతు. శాస్త్రీయ విభాగంలో సోలో పోటీలు, పాశ్చాత్య నృత్యంలో సోలో, గ్రూప్ డ్యాన్స్, జానపద నృత్యాల కేటగిరీల్లో ఈ పోటీలను జరిపారు. పోటీల తదుపరి విజేతలకు ప్రథమ బహుమతిగా బంగారు నాణెం, ద్వితీయ బహుమతిగా వెండి నాణెం, తృతీయ బహుమతిగా నగదును అందజేశారు. పోటీల్లో పాల్గొన్న బాలికలు అందరికీ బహుమతులను అందజేశారు. రెయిన్‌బో ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ డి.జీవనలత ఆధ్వర్యంలో జరిగిన పోటీలను ఆలేఖ్య, వరలక్ష్మి, జ్యోతికాంత్, కోట భవాని, వసంత, భవ్య, అనూరాధ పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో 714 కేసుల పరిష్కారం



తెనాలి రూరల్ : మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి కోర్టుల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. కేసుల పరిష్కరించడానికి నాలుగు బెంచ్‌లను ఏర్పాటు చేసి 714 కేసులు పరిష్కరించారు. వీటిలో 56 సివిల్ కేసులు, 656 క్రిమినల్ కేసులు, 2ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించారు. సుమారు రూ.5 కోట్ల 57 లక్షలు బాధితులకు ఇప్పించారు. 11వ అదన పు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్ పాల్గొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్ 100 శాతం పూర్తవ్వాలి

కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరిటౌన్: ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి తప్పిదాలకు తావు లేకుండా వంద శాతం పురోగతి సాధించాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని కాజా సచివాలయంలో శనివారం ఎల్‌ఆర్‌ఎస్‌పై రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, డెవలపర్లు, స్థల యజమానులకు అవగాహన కల్పించారు. కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ అక్టోబర్ 23లోపు రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఎల్‌ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్‌తో ఆ స్థలానికి న్యాయబద్ధమైన గుర్తింపు లభిస్తుందని, భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఆస్తి భద్రత కల్పించుకోవచ్చని సూచించారు. ఈ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఓపెన్ స్పేస్ చార్జీల్లో 50శాతం రాయితీ ఇచ్చామన్నారు. బిల్డింగ్ ప్లాన్ అనుమతి కావాలన్నా, లోన్, క్రయ విక్రయాలు జరపాలన్నా, ప్లాట్ రెగ్యులర్ చేయించుకుని ఉంటే మంచిదని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలు, ఎల్‌టీపీలు, ల్యాండ్ ఓనర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో కమిషనర్

# సీతారాం ఏచూరి జీవితం ఆదర్శం

తాడేపల్లి రూరల్: సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.రవి అన్నారు. తాడేపల్లి రూరల్ ఉండవల్లిలో డివిజన్ నేత వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి, వీరనారి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ చిత్రపటాలకు రజక వృత్తిదారుల సంఘం నాయకులు ఈమని రామారావు, బొజ్జ సుబ్బారావుతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా సీతారాం రాజీలేని పోరాటం చేశారన్నారు. తెలంగాణలో సాగిన సాయుధ పోరాటంలో తుపాకీతో పోరాడిన వీరనారి చిట్యాల ఐలమ్మ పేదలకు భూములు పంపిణీ చేయించారని తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో తుపాకీ గుళ్లకు బలైన సత్తెనపల్లి రామకృష్ణ ఆశయ స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు బక్కిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఉండవల్లి పార్థసారథి, గాంధీ, ఓలేటి శ్రీనివాసరావు, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ స్థలం ఆక్రమణ!

టీడీపీ నేతల అండ

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్(ఎంటీఎంసీ) పరిధిలో టీడీపీ నాయకుల అండతో ఆ పార్టీ కార్యకర్తలు కార్పొరేషన్ స్థలం ఆక్రమించడమే కాక దాన్ని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణంలోని కొప్పురావు కాలనీ బీసీ హాస్టల్ ఎదుట ప్రధాన రోడ్డు వెంట స్థలాన్ని ఆక్రమించిన టీడీపీ కార్యకర్త అందులో పిచ్చెక్కిస్తా అనే పేరుతో పానీ పూరి బండి ఏర్పాటు చేశాడు. కొద్ది రోజులు నడిపిన అనంతరం పానీ పూరి వ్యాపారం తీసివేసి అదే కార్పొరేషన్ స్థలానికి టులెట్ బోర్డు పెట్టడంతో స్థానికులు అవాక్కయ్యారు. ఏకంగా అద్దెకు ఇచ్చేందుకు బోర్డు ఏర్పాటు చేశారంటే కార్పొరేషన్ స్థలాల ఆక్రమణలపై పట్టణ ప్రణాళికా అధికారులు ఏం చేస్తున్నారనేదానిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకుల అండతో స్థలాన్ని ఆక్రమించడమే కాక అద్దెలకు ఇచ్చే ధైర్యం చేస్తున్నారని తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.




కార్పొరేషన్ స్థలం ఆక్రమించి ఏర్పాటుచేసిన టులెట్ బోర్డ్

## 'చిప్స్ ఫార్మసీ'లో పీసీఐ నూతన సిలబస్‌పై అవగాహన

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరం గ్రామంలోగల చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో శనివారం కళాశాల ఏపీటీఐ, ఐపీఏ, ఐపీఏ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టనున్న నూతన సిలబస్‌పై ప్రతిస్పందన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర మాట్లాడుతూ నూతన సిలబస్ మార్పులు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. డిగ్రీ స్థాయిలో సిలబస్ పునర్వ్యవస్థీకరణ ద్వారా విద్యార్థులకు ఆధునిక కోర్సులపై అవగాహన పెరుగుతుందన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోర్సు రూపకల్పన చేయడం వల్ల, విద్యార్థులు ప్రాక్టికల్ స్కిల్స్, పరిశ్రమ–ఆధారిత శిక్షణ, ఆరోగ్య పరిరక్షణ, క్లినికల్ సేవలలో మెరుగైన అవకాశాలను పొందగలుగుతారని చెప్పారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు నిరంజన్ మాట్లాడుతూ నూతన సిలబస్ ద్వారా విద్యార్థులు మారుతున్న ఫార్మసీ వాతావరణానికి తగిన విధంగా స్పందించగలుగుతారన్నారు. దేశీయ ఫార్మా పరిశ్రమలకు నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఏపీటీఐ ప్రెసిడెంట్ రమణ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు కూడా పరిస్థితులకు అనుగుణంగా, నూతన టెక్నాలజీస్ నేర్చుకొంటూ, విద్యార్థులకు తెలియచేస్తూ ముందుకు నడవాలని తెలిపారు. డాక్టర్ అంకమ్మ చౌదరి, ప్రొఫెసర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాసుబాబు ముసాయిదాలో చేయవలసిన మార్పులు చేర్పుల గురించి సూచనలు సలహాలను అందజేశారు. ఫార్మసీ విద్యారంగంలో విద్యార్థుల ప్రయోజనార్థమై ఈ విధమైన అవగాహన కార్యక్రమ రూపకల్పనలో కృషి చేసిన తమ కళాశాల అధ్యాపకులు, అవగాహన కార్యక్రమానికి విచ్చేసి న వివిధ ఫార్మసీ విద్యారంగ ప్రతినిధులకు చిప్స్ కళాశాల యాజమాన్యం అభినందనలను తెలిపారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ మూర్తి, ప్రిన్సిపాల్ పద్మలత, వివిధ కళాశాల ప్రిన్సిపాళ్ల తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిప్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర తదితరులు

# ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు





ప్రమాదంలో గాయపడిన చాంద్‌బాషా, అతని భార్య

ఘటనలో నెల్లూరుకు చెందిన భార్యాభర్తలకు గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలైన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా నెల్లూరుకు చెందిన చాంద్‌బాషా తన భార్య, కుమారుడితో కలిసి విజయవాడలోని ఓ కళాశాలలో తన కుమారుడి సీటుకోసం మాట్లాడేందుకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో గుంటూరు నగర శివార్లలోని వై.జంక్షన్ సమీపంలో హైవేపై రోడ్డుపక్కన నిలిపివున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో చాంద్‌బాషాకు, అతని భార్యకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి ఇరువురిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇరువురి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లపాడు పోలీసులు తెలిపారు.